# తూర్పు వెళ్ళని రైలు

"బత్తేల బండికింకా ఎంత టైముంది బాబూ?" అంటూ ఆదరా బాదరాగా ఒగుర్చు కుంటూ స్టేషనులోకి అడుగు పెట్టింది ఓ ముసిల్ది. ఎవరూ దాన్ని పట్టించుకోలేదు.

విసుక్కుంటూ, మళ్ళీ ఒకరిద్దరిని వాకబు చేసింది. లైనుక్లియరు గంట కొట్టలేదని తెలుసుకుని స్థిమిత పడింది. అప్పుడింక తాపీగా, సగం తాగి, ఆర్పేసిన చుట్ట తీసింది. అటూ యిటూ చూసి, ఎవర్నో బతిమలాడి అగ్గి పెట్టె తీసుకుని, చుట్ట ముట్టించింది. గుప్ గుప్‌న పొగ పీల్చి, అది ఎర్రగా కాలేక, అడ్డ పొగ పెట్టుకుంది. ముసిల్దానికి అరవైయ్యేళ్ళు దాటి ఉంటాయి. జుత్తంతా తెల్ల బడి పోయింది. ముఖం మీద చర్మాన్ని లాగేసి నట్టుగా ముడతలు. మాసిన ముతక గళ్ళ చీర కచ్చపోసి, అడ్డకట్ట కట్టింది. రవికె వేసుకోలేదు. చేతికి మట్టి గాజులు. మెడలో పసుపు తాడు. ముఖాన రూపాయ బిళ్ళంత కుంకుమ బొట్టు. కాళ్ళకి యింత మందాన ఇత్తడి కడియాలు. చెవి కమ్మల బరువుకి సాగిపోయిన చెవులు, తోలు బద్దల్లా వేలాడుతున్నాయి. ముక్కున అడ్డ బాస. ఆత్రుతని అణచుకోలేక రైలు రాక కోసం ఎదురు చూస్తోంది. దాని చూపు కనీసం ప్లాట్ ఫారం చివరి వరకూ అయినా ఆనడం లేదు. విసుక్కుంటూ తనలో తనే ఏదో గొణుక్కుంటోంది. "బత్తేల బండి యింకా ఎంత సేటవుద్ది బాబూ" అని మళ్ళీ ఎవర్నో అడిగింది. అక్కడి వాళ్ళకది మామూలే. ఆ రైలు వచ్చే వరకూ అది అలా అడుగుతూనే వుంటుంది. దాని మాటలు వారికి వాగుడుగానూ, దాని ఆందోళన వారికి నస పెడుతున్నట్టుగానూ ఉంటుంది. జవాబు చెప్తే చెప్తారు; లేకపోతే లేదు.

"హొచ్చేస్తాది, యింకో సిటువో, సెణ! వో" ఏ కళ నున్నాడో, జవాబిచ్చేడు ఒకతను. ధదాంతో తృప్తి పడి, ముసిల్ది మరి మాట్లాడ లేదు. చుట్ట తాగుతూ రాబోయే రైలు బండి కోసం ఎదురు చూస్తూ కూచుంది. దాని నిరీక్షణ – బత్తేల బండిలో వచ్చే ముసలయ్య కోసం. వాడు తెచ్చే సరుకుల కోసం.

వాటిని అమ్మితే వచ్చే డబ్బుల కోసం. ఆ పూట బత్తెం కోసం.

* * *

ఆ ప్లాట్ ఫారం అంచు మీద నిలబడి తూర్పు వేపు చూస్తే... రైలు బద్దీలు రెండూ కను చూపు మేర తిన్నగా సాగి, అంతకు అల్లంత దూరంలో చింతల తోపు దగ్గర అదృశ్యమైపోతాయి. అక్కడ రైల్వే లైను పెద్ద మలుపు తిరుగుతుంది. వచ్చే రైలు ఆ మలుపు తిరిగే వరకూ కనిపించదు; వెళ్ళే రైలు మలుపు తిరుగుతూనే చింతల తోపులో

దట్టమయిన చెట్ల నడుమ మాయమైపోతుంది. రైలు కోసం పడిగాపులు పడే ప్రయాణీకులు సాధారణంగా తమ దృష్టి అక్కడే నిలుపుతారు.

సాయంత్రం ఆరు కావస్తోంది. స్టేషను కవతల చెరువు కట్ట మీద నుండి వచ్చే శీత గాలి శరీరాన్ని గిలిగింతలు పెడుతోంది. దూరాన ఉండే కొండలు, మంచు దుప్పట్లు కప్పుకుని కనిపించడం లేదు. చింతల తోపు చీకటి ముద్దలా ఉంది. ఆ సిగ్నల్ ట్రాక్‌కి అవతల టెలిఫోన్ తీగెల మీద ఏవో పక్షులు బారులు తీసి, రొద చేస్తున్నాయి.

నాలుగింటికి రావాల్సిన రైలు ఇంకా రాలేదు. ఆ రైలు వస్తే, స్టేషను బద్ధకం వదిలి పెట్టి, వొళ్ళు విరుచుకుని, నిద్ర లేచి నట్టుగా కాసేపు కళ కళలాడి పోతుంది. ఆసందడి కాస్సేపే. మళ్ళీ అర్థరాత్రి దాటేక కానీ ఆ లైన్లో మరి ఏ రైలూ లేదు. నిశి వేళ వచ్చే ఆ పాసింజరు బండి లోనుంచి అట్టే జనం దిగరు కనుక – స్టేషను మత్తుగా జోగుతున్నట్టుగా నిశ్శబ్దంగా వుంటుంది, ఆ వేళప్పుడు. మస్తానయ్య గంట కొట్టే చప్పుడు, దిగుడు బావి లోంచి వినిపిస్తున్నట్టు గార్డు వేసే విజిలు, నిద్ర మత్తుతో, బొంగురు గొంతుకలతో వినిపించే వొకటీ రెండూ మాటలూ – రైలు కూత వేసి బయలు దేరేటప్పుడు చేసే శబ్దంతో మిళితమైపోతాయి. అంచేత ఆ చిన్న స్టేషనులో సందడేమయినా ఉండేది రాబోయే రైలుకే; బత్తేల బండికే. దాని రాక పోకలకి సరైన వేళా పాళా అంటూ ఉండదు. ఒక్కో సారి గంటల కొద్దీ లేటుగా వస్తూ ఉంటుంది. అందువల్ల – తొందర పనులున్న వాళ్ళూ, డబ్బున్న వాళ్ళూ ఆ పాసింజరు రైలు ఎక్కడం ఎప్పుడో మానీసేరు. ఆ లైన్లో వొకటో, రెండో ఎక్స్‌ప్రెస్ రైళ్ళున్నా, అవి అక్కడ ఆగవు. బీదా, బిక్కీ, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవాళ్ళు మాత్రం దాని రాక కోసం కనిపెట్టుకుని కూచుంటారు.

ఒక విధంగా చెప్పాలంటే చిన్నా, చితుకూ వ్యాపారస్థులకి అదే జీవనాధారం. ఒరిస్సా, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దులలో ఉన్న చిన్న గ్రామం అది. కోస్తా ప్రాంతంలో ఆంధ్రకి చెందిన చివరి గ్రామం కూడా అదే. ఉదయాన్నే ఒరిస్సా వేపు వెళ్ళే పాసింజరు బండిలో ఆడా మగా, చిన్నా పెద్దా తేడా లేకుండా – చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ పొట్ట పోసుకునే వాళ్ళు బయలు దేరి, వెళ్తారు. ఒరిస్సా సరిహద్దు గ్రామాలలో చవగ్గా దొరికే వస్తువులని కొనుక్కుని, మళ్ళీ సాయంత్రం బండికి తమ గ్రామానికి చేరుకుంటారు. సాధారణంగా వాళ్ళు తెచ్చేవి – కర్రల ముట్టెలు, బొగ్గుల బస్తాలు, ఐదూ పదీ కేజీలుండే బియ్యం మూటలూ... సీజన్లో అయితే చింత పండులాంటి అడివి దినుసులు. ఎప్పుడూ టిక్కెట్లు కొనుక్కోరు. ఎవరికి ముట్ట చెప్పవలసిన డబ్బులు వాళ్ళకి యిస్తూనే వుంటారు కనుక వాళ్ళ దగ్గర టిక్కెట్టు లేకపోయినా, వాళ్ళు అక్రమంగా సరుకులు రవాణా చేస్తున్నా, ఎవరూ పట్టించుకోరు.

రైలు చింతల తోపులో ఉన్నప్పుడే మొదలవుతుంది కోలాహలం!

రైలు చెట్ల మధ్య నుంచి వొస్తున్నప్పుడు – స్టేషను దగ్గర నుండి చూస్తే, చింతల తోపు, ఆకాశంలో దట్టమైన కరి మబ్బుల్లాగా, ఆ బొగ్గు యింజను వదిలే నల్లని పొగతో ముందుగా కనిపిస్తుంది. అప్పుడు చింతల తోపు – నల్లని బొచ్చు టోపీ పెట్టు కున్నట్టుగా

వుంటుంది. ఆ తర్వాత రెండు క్షణాలకే రైలు చప్పుడు దూరం నుండి వినిపించడం... అంతలోనే రైలింజను కనిపించడం జరుగుతుంది. అది కని పించడంతో పాటే మస్తానయ్య సైటు బెల్లు గణ గణా కొడతాడు. ఆ చప్పుడు ఇంకా రింగుమని వినిపిస్తూండగానే బత్తేల బండి నిండు గర్భిణీలా నెమ్మదిగా ప్లాట్ పారమ్మీదకి వచ్చి ఆగుతుంది. అప్పుడిక మొదలవుతుంది సందడి! సరుకులు దిగగానే మధ్య దళారీలు వాళ్ళని ఈగల్లా ముసురుకుంటారు. సరుకులు తెచ్చే తమవాళ్ళ కోసం, స్టేషనుకొచ్చిన జనం వాళ్ళని వెతుక్కుంటూ అటూ యిటూ పరిగెడుతూ ఉంటారు. కొందరయితే, రైలు స్టేషనులోకి రాకుండానే తాము తెచ్చిన మూటల్ని రైల్లోంచి విసిరేస్తూవుంటారు. వాటి కోసం కాపలా కాచుకుని వుండే, వాళ్ళ మనుషులు, గబ గబా వాటిని పోగు చేసుకుని, ఎవరికీ చిక్కకుండా ఆ పొలాలంట అడ్డం పడి ఊర్లోకి పరుగులు తీస్తూ ఉంటారు. ఇది గమనించి, అరుస్తూ వాళ్ళ వెంట పడే మారు వర్తకులూ, రైల్వే స్టేషను మనుషుల కేకలూ - రైలొచ్చే సరికి టంచనుగా వచ్చేసి, తమ మామ్మూళ్ళు వసూలు చేసుకునే పోలీసు కానిస్టేబిలు జబర్దస్తీ అరుపులూ, దళారీల బేర సారాలూ - వీటితో ఆ కాస్సేపు అక్కడ సందడి జాస్తీ గానే ఉంటుంది. అసలు దళారీలు సరుకుల కోసం కొందరికి ముందుగానే బయానాలు యివ్వడం, సరుకులు తేవడానికి మదుపులు పెట్టడం వల్ల చాలా బేరాలు రైలు రాక ముందే సెటిలై పోతాయి. ఎవరి సరుకు ఎవరికి అమ్మాలో కూడా నిర్ణయమైపోతూ ఉంటుంది. తెచ్చిన సరుకుల్ని అయిన కాడికి అక్కడే చెల్లు-బడి చేసుకుని, డబ్బులు పట్టుకుని కొంపల కెళ్తారు. అలా వచ్చే పదో పరకో తెస్తేనే కొంపల్లో పొయ్యి రాజుకునేది.

సాధారణంగా ఈ వ్యాపారానికి అడ్డంకులు ఏర్పడవు. మహా అయితే మస్తానయ్య వాళ్ళు ఇచ్చినది చాలదని గునుస్తాడు. ముసలి స్టేషను మాష్టరూ, ఇతర రైల్వే ఉద్యోగులూ వాళ్ళ డబ్బులు వాళ్ళకి పడటం వల్ల పట్టించు కోరు. లోకల్ పోలీసుల వాటాల సంగతి సరే సరి. అందరి మామూళ్ళూ పోగా, మిగిలిందే చాలనుకుని, వాళ్ళు కొంపలకి పోయి, గంజి నీళ్ళతో కడుపు నింపుకుంటారు. బేరాలు బాగున్నప్పుడు నెత్తళ్ళో, చేపల పులుసో వండుకో గలిగితే వాళ్ళకి ఆ రోజు పండగే! ఇలా అక్కడ చాలా మందికి ఆ పాసింజరు రైలు వస్తేనే యింట్లోకి బత్తెం దొరికేది. అందుకే దాన్నంతా బత్తేల బండి అంటారు. అందరితో పాటూ ఆ సాయంత్రం వేళ - చిరు చలి గాలులకి సన్నగా వణుకుతూ, ముసిల్ది కూడా ఆత్రంగా బత్తేల బండి కోసం ఎదురు చూపులు చూస్తోంది.

రైలు 'ఇంకో సిటుహో, సెణహో' వస్తుందని చెప్పిన ఆసామీ మరిటు వేపే రాలేదు. రైలు వచ్చే జాడ కూడా లేదు. ముసిలామెలో కంగారు రాను రాను ఎక్కువయి పోతోంది. ఉదయం సరుకుల కోసం వెళ్ళిన భర్త గురించే ఆలోచిస్తోంది. వాడి గురించే ఆమె ఆందోళన అంతా.

ఉదయం బండిలో వెళ్ళాడు భర్త. రాత్రి చేసిన కుడుం ముక్క సిల్వరు డబ్బాలో పెట్టుకుని, పట్టు కెళ్ళాడు. అది తిని, టీ నీళ్ళతో కడుపు నింపు కోవాలి. తిన్నాడో లేదో! వాడికి వొంట్లో సత్తువ లేదు. దెబ్బయ్ యేళ్ళుంటాయేమో. పైగా ఉబ్బసం వొకటి. ఈ

రొజ్జ గాలి వాడి కసలు పడదు. భర్త గురించిన ఆలోచనల్తో ముసిల్దాని ప్రాణం జిలార్చుకు పోతూంది. ఆ పూటకాముద్ద దొరకాలంటే వాడికా తాపత్రయం తప్పదు మరి! లేక పోతే పస్తే.

ముసిల్దానికి ఓపిక తగ్గి పోతోంది. రైలు కోసం ఎదురు చూసి, చూసీ విసుగెత్తి పోతోంది. వెచ్చటి టీ నీళ్ళు గొంతులో పోసుకుంటే బాగుణ్ణు అనిపించింది. అతి కష్టం మీద ఆ కోరిక అణుచుకుంది.

ఇంతలో స్టేషన్లో కలకలం మొదలయింది. ముసిల్ది చూపు చికిలించి చూసింది. వాళ్ళే – మారు బేర గాళ్ళు! వాళ్ళొచ్చేసేరంటే రైలొచ్చే టైమయిందన్న మాట! ఎలా తెలుసు కుంటారో, రైలు ఇంకో పది నిమిషాలలో వస్తుందంటే బిల బిలలాడుతూ కాకుల్లా దిగి పోతారు. మరి కాస్సేపటిలో పోలీసు జవాను కూడా బుగ్గన జర్దా కిళ్ళీ బిగించి, చేతిలో చార్మీనార్ సిగరెట్ తో, లాఠీ వూపుకుంటూ ప్లాట్ ఫారం మీదకి దిగబడుతాడు. బేరాలు మొదలవుతాయి. బయానాలిచ్చు కోడాలూ, 'నివాడా' లెక్కలు సరి చూసుకోవడాలూ ప్రారంభమవుతాయి.

ముసిల్ది కూచున్న చోటి నుండి వాళ్ళ దగ్గరకి వెళ్ళింది. దాని దృష్టి అక్కడ, వాళ్ళ మధ్య మాట్లాడుతూ నిలబడిన రాజమ్మ మీద పడింది. "పింజారీ ముండ! అప్పుడే లెడీ అయి పోనాది!' అక్కసుగా మనసులో అనుకుంది, ముసిల్ది. రాజమ్మ మొగుడు లైను కెళ్ళి; సరుకులు బాగానే తెస్తాడు. రాజమ్మ తన మాటకారి తనంతో కొంచెం మంచి ధరకే వాటిని అమ్ముతూ ఉంటుంది. మంచి పరువంలో ఉందది. నిగ నిగలాడే నల్లని వొళ్ళూ, వంకీల జుత్తు, పిట పిటలాడే రవికె. చురుగ్గా చూసే పెద్ద పెద్ద కళ్ళూ – రాజమ్మ చొరవ అక్కడి మగాళ్ళకి మరింత ఆకర్షణ కలిగిస్తూ ఉంటుంది. వస పిట్టలా ఏదో వాగుతూ ఉంటుంది. వేళాకోళం చేస్తూ వుంటుంది! ముసిల్ది కనిపిస్తే మరీనూ! అందుకే ముసిలామెకి రాజమ్మంటే పడదు. పెట్టుబడికి డబ్బు, వంట్లో శక్తీ రెండూ లేకపోవడం వల్ల ముసలయ్య పూర్వంలా సరుకులు తేలేక పోతున్నాడు. డబ్బుల్లేక నాసిరకం సరుకులు తెస్తూండడం వల్ల , అవి అమ్ముడయేసరికి ప్రాణం కడ తేర్చుకుపోతోంది ముసిల్దానికి. రాజమ్మ దృష్టి ముసిలామె మీద పడనే పడింది. " ముసిలోడు ఇయ్యేల లైను కెళ్ళేదేటోలమ్మ!" అని అడిగింది. వగలు కురుస్తూ అది అడిగిన తీరుకి చిర్రెత్తుకొచ్చింది ముసిలామెకు. జవాబు చెప్ప లేదు. "మాతో మాట్లాడ కూడదేటి? నోరిప్పితే రతనాలు జలజ్జ్రాలి పోతాయి కాబోలు!" ముసిల్ది మరి ఓర్చుకో లేక పోయింది. "మా వూసు నీ కేల!... నీ యేపారం నువ్వు చూసుకో" అంది చిరాగ్గా.

"అబ్బోసి, ముసిల్దానికి పౌరుసం పొడుచు కొచ్చేసినాది! ఇంతకీ ఆడేటి తెస్తాడు? బియ్యం మూటలు కావాల్న." ముసిలామెను అకారణంగా రెచ్చ కొట్టడం దానికి సరదా. "బియ్యం మూటలే తెస్తాడో, బెల్లం దిమ్మలే తెస్తాడో – నీ వొయిసులో మావూ సేసేం లేయే మా గొప్ప యేపారం... వూరికే తుళ్ళి పోకమ్మా.... నువ్వేటి మమ్మల్ని పెంచుతున్నావా?

పోసకారం సేస్తున్నావా? వల్లకో, వల్లకో..." అంటూ రాజమ్మని కసిరింది ముసిల్ది. చుట్టూ ఉన్న వాళ్ళు రాజమ్మ మాటలు వింటూ వినోదిస్తున్నారే తప్ప, ఆమెని వారించడం లేదు.

"ముసిలోడికి డబ్బు యావ కాకపోతే, అడెందుకు లైను కెళ్ళడం" అన్నాడొకడు. "ఈడు రైల్లో టీసీలకి డబ్బులిచ్చే చోట గీకి గీకి బేరవాడుతాడు. యివ్వనానికి పైసలుండవ్.. కాని, లైను యాపారానికి మాత్రం దొరబాబు నాగా తయారయి పోతాడు. సీ! సీ! ఈడి వల్ల బిజినెస్సు చేసుకునే మనపింటోళ్ళకి మాటొస్తున్నాది, దినావూ!" అని చీదరించు కున్నాడొకడు. ముసిల్దానికి మనసు మండి పోతోంది.

వాళ్ళతో తగువు పెట్టుక్కూచుంటే జరగదు తనకి. ఈ ఉదయం కిరాణా కొట్టు సాంబయ్యని కాళ్ళా వేళ్ళాపడి ఓ యేభై రూపాయలడిగి తీసుకెళ్ళాడు ముసిలోడు. కర్రల ముట్టెలు తెస్తా నన్నాడు. దళారీల్లో కర్రల అడితీ మనుషుల కోసం వెతకాలి. బేరం ఇక్కడే సెటిలయి పోవాలి. వాటిని మోసుకుంటూ ఊళ్ళోకి వెళ్ళడం తమ తరం కాదు. అంతే కాదు – చెక్ గేటు వాళ్ళ బారి నుంచి వాటిని కాపాడు కోవడమూ కష్టమే! అంగుకు – అయిన కాడికి వాటినిక్కడే అమ్మెయ్యాలి. ముసిల్ది ఆ మనిషి కోసం వెతుకుతూ ఉంటే కర్రల అడితీ గమస్తా గురవయ్య కనిపించేడు. ఆమెకి ప్రాణం లేచొచ్చినట్టయింది. గబ గబా అతని దగ్గరకి వెళ్ళింది. "బాబూ, గురవయ్య బాబూ! మా యజమాని ఇయ్యేల కర్రల ముట్టెలు తెస్తాడు బాబయ్యా..." అంది అతనితో. "తీసుకు రానీ, చూదాం..." అన్నాడతను ఉదాసీనంగా.

ముసిలామె కంగారు పడి పోయింది. "బండి దిగ్గానే నీ కాడ కొస్తాం బాబూ, నువ్వే కొనాలి..." అతనామె వేపు ఎగాదిగా చూసేడు. "మా తండ్రి... మా నాయన... కాదనకు కొడకా!" అంది అర్థిస్తున్నట్టుగా, "వాడేం తేగలడే, ముసిలీ! – తెచ్చినా, మీతో బిజినెస్సు మేం చెయ్యలేం... మహ కాని పేచీకోరు మనుషులు మీరు..." తెగేసి చెప్పాడతను నిక్కచ్చిగా. ముసిల్ది ముఖం గంటు పెట్టుకుంది. అతనక్కడ నుండి కదలి వెళ్ళిపోబోయేడు. ఆమె అతని వెంట పడింది. "అదేటి తండ్రీ అలాగంటావు? నీతో మావెప్పుడు తగూలాడేము! నువ్వెంత సెప్తే అంత. ఎంత నెక్కగట్టి ఇస్తే అంత. కాదంటామేటి?" అంది గాభరాగా. "సరే, బండి రానీ చూద్దాం..." అన్నాడతను. అలా నిర్లిప్తంగా మాట్లాడడంలో ఉండే వ్యాపారపు మెళకువలు అతనికి తెలుసు మరి!

ఆపాటి మాటకే ముసిల్ది సంతృప్తి చెందింది.

ఇంతలో స్టేషన్లో హడివిడి మొదలయింది. మస్తానయ్య గంట కొట్టేడు. రైలు వొగురుస్తున్నట్టుగా పెద్ద శబ్దం చేస్తూ వచ్చి ఆగింది. ప్లాట్‌ఫారం మీద ఉరుకులూ పరుగులూ మొదలయ్యేయి. ముసిలామె భర్త కోసం వెతక సాగింది. రోజూ – రైలు నెమ్మదిగా ఆగుతూ ఉండగానే, కంపార్టుమెంట్‌లోంచే భార్యని పేరు పెట్టి పిలవడం అతని అలవాటు. ఆ గొంతు విని, అటు వేపు వడి వడిగా వెళ్ళి, సరుకులు దించడంలో అతనికి సాయం చేస్తుందామె. ఇవాళ రైలొచ్చి, ఆగడం పూర్తయినా ముసలయ్య జాడ ఎక్కడా లేదు! అతని గొంతు వినిపించ లేదు. ముసిల్ది కంగారుగా అటూ యిటూ వెతికింది. ఆ గోలలో భర్త గొంతు కలిసి పోయి వినిపించ లేదేమో నని అనుమానం వచ్చిందామెకి. ఆమె మనసు

ఆందోళనతో బరువెక్కిపోయింది. శరీరంలో సన్నని వణుకు మొదలయింది. తడారి పోతున్న గొంతు పెగుల్చుకుని, భర్తని ఎలుగెత్తి పిలుస్తూ జనాన్ని తప్పించుకుని వెతక సాగింది. ముసలయ్య ఎక్కడా కనిపించ లేదు. ఆమె గుండె లబ లబలాడింది. కళ్ళలో నీళ్ళు తిరిగి, దు:ఖం తన్ను కొస్తోంది.

రైలు దిగిన వాళ్ళలో తెలిసిన వాడొకడు వస్తూంటే, ఆపి, భర్త గురించి వాకబు చేసింది. వాడు తన తొందరలో జవాబు చెప్పకుండా వెళ్ళి పో బోయేడు. ముసిల్ది వాడ్ని వదల్లేదు. దాంతో వాడు ఎగాదిగా చూసి, చెప్పేడు: "ఆడా!... ఆడు... టీసీ గోరికి మామూలియ్యడానికి డబ్బులు మిగల్నేదని సెప్తే, ఆ బాబు ముసిలోడ్ని ఎనక టేసనులో బండి దించీసినాడు..." అని చెప్పి, హడివిడిగా వెళ్ళి పోయేడు. ముసిలామె బిత్తర పోయింది! ఆమె గుండె చిద్రుపలు చిద్రుపలై పోయినట్టయింది. నేలలోకి కూరుకు పోతున్నట్టయింది. ప్రాణం కడతేర్చుకు పోతున్నట్టయింది. గొల్లుమంటూ ఏడవడం మొదలెట్టింది.

"ఓర్నాయనో! డబ్బులు సాల్లేదు కావాల!... ఆదు టిక్కెట్టు కట్ట నేదని దించీసినారా? ఆకాడికి మీరంతా టిక్కెట్లు కొంటున్నారేట్రా!... ఏదో వొక పాలి... ఆ బాబుకి డబ్బులియ్యక పోతే బండి లోంచి దించెయ్యడవే? ఎప్పుడూ యిచ్చే వోళ్ళమే కదా! వొక పాలికి తప్పు కాయనేడా! ఈ సీకట్లో ఆడేటయి పోతడ్రా నాయనో!... పెందిలి కాడ్నుంచి ఆడికి తిండీ తిప్పలూ కూడా సరిగ్గా నేవు... ఈ రాత్రి ఎందలబడి పోతాడు బాబోయ్..." అంటూ పెడ బొబ్బలు పెట్ట సాగింది. ఒకరిద్దరు ఆమె కేకలకి అటు వేపొచ్చేరు. వాళ్ళని చూసి ఆమెకి దు:ఖం, కోపం మరింత అధిక మయ్యేయి. "ఆడి కాడ డబ్బులు సాల నేదో ఏటో... తెలిసిన ముకాలు... మీరింత మంది వున్నారు... ఆడ్ని ఆ బాబు బండి దించేస్తూ వుంటే సిత్రాలు సూస్తూ వుండిపోనారేట్రా ఎదవల్లారా!" అరిచి నట్టుగా అడిగింది వాళ్ళని.

ముసాలామె మరి దు:ఖం ఆపుకో లేక పోయింది. ఏడుస్తూ ఇంజను వేపు పరిగెత్తింది. దాని మనసు కల్లోలిత సముద్రంలా ఉంది. దానికి – అప్పుడా రైలు... పెను పిశాచం లాగానూ, హడావిడిగా తిరిగే ఆ జనం కఠిన పాషాణాల్లాగానూ తోచేరు. ఏడుస్తూ ఇంజను దగ్గరికి చేరింది. పొగలూ సెగలూ కక్కుతున్న ఆ ఇంజను పాపాల పుట్టలా ఉంది. పగిలిన అగ్ని పర్వతంలా ఉంది. మృత్యువుకి ముఖ ద్వారంలాగానూ ఉంది. క్షణంలో సగం సేపు ఏం ఆలోచించుకుందో, గబ గబా రైలింజను దాటుకుని, వెళ్ళి, గభాలున ఇంజను ముందు రైలు పట్టాల మీద చతికిల బడి పోయింది. అప్పుడింక పిచ్చి పట్టిన దానిలా పెద్దగా ఏడుస్తూ, బిగ్గరగా అరవడం మొదలెట్టింది. ఇంజన్ డ్రైవరు తప్ప, మొదట అదెవరూ గమనించ లేదు. డ్రైవరు బిత్తర పోతూ ఇంజన్ లోనుంచి ఒక్క ఉదుటున గెంతి, ఆమె దగ్గరకి వచ్చేడు. జనం ఒకరూ, ఒకరూ పోగయ్యేరు.

ముసిలామె శాపనార్థాలు పెడుతూ అందర్నీ తిట్ట సాగింది. 'నానీ బండి కదల నియ్యను!... నామొగుడ్ని బండి నోంచి ఎందుకు దించీసినారో ముంగల సెప్పాల నాకు! ఈ గోరం ఎందుకు సేసేరో సెప్పాల! నా పెనిమిటిని నాకు తెచ్చియ్యాల!" అంటూ గొడవచేయసాగింది. ఈ గొడవ ఆ నోటా, యీ నోటా తెలిసి – బండి లోని టీసీలూ, గార్డూ, స్టేషనులోని ఉద్యోగులూ అంతా గాభరాగా అక్కడి కొచ్చేరు. ముసిల్దాని వ్యవహారం

చూసి, విస్తు పోయేరు. వాళ్ళు రావడంతో ముసిలామె మరింత రెచ్చి పోయింది. దాని ఏడుపు నానా బీభత్సంగానూ ఉంది. ఆవేశంతో ఊగి పోతోంది. పైట జారి పోయి, ఆచ్ఛాదన లేని దాని గుండెల మీద ఎండి పోయిన రొమ్ములు ఎగిసి పడుతున్నాయి. భయంతో, ఆర్తితో, దాని ముఖం వికృతంగా ఉంది. దాని గొంతులో అంతు లేని విషాదం బొంగురు పోయి, గర గరలాడుతోంది.

"నాన్సెన్స్... ఏమిటీ గొడవ" అంటూ విసుక్కున్నాడొక టీసీ. దాని మొగుణ్ని ముందు స్టేషన్లో దించేయడమే అది చేస్తున్న యాగీకి కారణం అని తెలిసేక, మరింత మండి పడి పోతూ అన్నాడు: "వాడి దగ్గర టిక్కెట్టు లేదు. అక్రమంగా సరుకు తీసుకొస్తున్నాడు. అందుకని వాణ్ని దించేసాం - దానికింత అల్లరి చేస్తా వేం? పోలీసులకి అప్పగిస్తాం, జాగ్రత్త!" అని బెదిరించేడు. ఆమె చలించ లేదు. అతని వేపు నిర్లక్ష్యంగా చూసి, అరుస్తూ అంది: "ఏటీ?... నా మొగుడు టిక్కెట్టు కట్ట నేదనా, దింపీసి నావు? ఈ బత్తేల బండిల అసలు నిబ్బగ టిక్కెట్టు కట్టి తిరిగే వోళ్ళెరో సెప్పుమీ సూద్దాం... ఆళ్ళందరినీ దింపీసి నావేటి?"

ఆ మాటలతో టీసీకి రోషం పొడుచు కొచ్చింది.

"నోర్మూయ్... ముండా!... మాకు మా డ్యూటీ గురించి నువ్వు చెప్పనక్కర లేదు... రూల్సు ప్రకారం వాడిని బొక్కలో తోయించాలి... ముసిలాడని వొదిలీసేం... సంతోషించు..." అన్నాడు కోపంగా. ముసిల్దానికి తిక్క రేగి పోయింది.

"మీ రూల్సూ గీల్సూ నాకాడ సెప్పొద్దు... మీ జేబీలు నిండితే అవి మిమ్మల్నేటీ సెయ్యవ్... ఇంత కాలం మీ జేబీలు నింప నేదా? ఆడియాల దబ్బులు సాలక, మీ మాామూలిచ్చుకో నేక పోయేడని - ముసిలాడని కనికారంకూడా నేకుండా - బండి దించీసినారు! ఏటి బాబూ! మేంసేసేది దొంగ యాపారమే. కాదన్ను. నిజివే! కాని, మా సరుకులు కొనుక్కుపోయి, పెద్ద యాపారాలు సేసే వోళ్ళని ఎవురూ ఏటీ సెయ్యనేరు... ఈ అన్నేయాన్ని, అదర్మాన్ని పెంచి పోసకారం చేస్తున్న దెవులు? మీరూ, మీలాటి పెద్దోళ్ళూ కదూ!... పోలీసుల్ని పిలుస్తావ్?... పిలు బాబూ... పిలు... అల్లద... అక్కడ- ఆడి మామూలు కోసం దేవులాడు కుంతన్నాడు..." ఆమె వాక్ప్రవాహానికి అడ్డు లేక పోతోంది.

"దాన్ని లాగి యివతల పారెయ్యండి..." ఉద్రేకంగా అరిచాడో అధికారి. "నాను నెగను... నెగను గాక నెగను!... నా మొగణ్ని తెచ్చేదాక నెగను... సీకట్లో ఆడిక్కడికి నడుసు కోని వచ్చేస్తుంటాడు...దార్ల ఆణ్ని ఏదేనా బంటి బక్కిరైె దిక్కేటి?... అదు సేమంగా వొచ్చీదాక నాను నెగనంతే!" అని, మరింత మొండికేసి , రైలు పట్టాలకి అడ్డంగా పడుకుండి పోయింది. ఎవరికీ ఏం చెయ్యాలో తెలీడం లేదు. "ఇదిగో, ముసిల్దానా నువ్విలా గొడవ సెయ్యమాక ...అదు క్షేమంగా తిరిగొస్తాడు... మాది పూచీ..." అంటూ తెలిసిన వాళ్ళెవరో నచ్చ చెప్ప బోయేరు. ముసిల్ది వాళ్ళ మీద యింతెత్తున గయ్యిమని విరుచుకు పడి పోయింది. "ఛీ!...సెత్కారీ నెమ్డి కొడుకుల్లారా!... మీరూ మనుషులేన్రా!... ఆదూ మీతో పాటే యేపారం సేస్తున్నాడు... మొకం మొకం ఎరిగి నోల్లం. ఆణ్ని బలివిని

బండి దించేస్తుంటే ఒగ్గేసెలా హొచ్చేసినారా! అలపింటోళ్ళు, నాకు బోద సేసీపాటి వోల్లయినారా!... థూ!..." అంటూ కాండ్రించి ఉమ్మేసింది.

దాని ఛీత్కారాలని మరింక వాళ్ళు సహించ లేక పోయేరు. దాన్నలా వాగనిస్తే ఎంత సేపయినా వాగుతూనే ఉంటుంది. బండి యిప్పటికే ఆలస్యమైపోయింది. దాన్ని మరి ఉపేక్ష చేయలేక పోయేరు. ఆ సరికే అక్కడి కొచ్చి, దాని గొడవ చూస్తూ నిలబడి పోయిన పోలీసు కానిస్టేబులుకి హఠాత్తుగా తన కర్తవ్యం గుర్తొచ్చింది. ముసిల్దాన్ని బూతులు తిడుతూ, దాని జబ్బ పట్టుకుని బలవంతంగా లాగి, రైల్వే లైనుకి అవతల పడేటట్టు విసిరేసాడు. ఆ విసురుకి – అది అల్లంత దూరంలోకెళ్ళి, కుప్ప కూలి పడి పోయింది. ఆ ముది వగ్గు శరీరంలో బలహీనపు టెముకలు బాధతో కర కరలాడేయి.

మరింక లేవడానికీ , ఏడవడానికీ కూడా శక్తి చాలక, ముసిల్ది అందరికీ శాపనార్థాలు పెడుతూ ఉండి పోయింది. అంతా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

దాని గొడవ చల్లారినందుకు అందరి ముఖాల్లోనూ సంతోషం కనిపించింది.

తన డ్యూటీ సక్రమంగా నెరవేర్చి, అక్కడ శాంతి భద్రతలు కాపాడ గలిగినందుకు పొంగి పోతూ 'ఇక రైలు బయల్దేరొచ్చు' అన్నట్టుగా, దర్పంగా స్టేషను మాష్టరు ముఖంలోకి చూసి, కళ్ళెగరేసాడు పోలీసు కానిస్టేబులు.

ఆ తర్వాత – కొద్ది సేపటికే గణ గణ గంట కొట్టేడు మస్తానయ్య. గార్డు పచ్చ లైటు చూపించేడు.

రాకాసిలా పెడ బొబ్బ పెట్టి, పడమటి చీకట్ల లోకి రైలు బయలు దేరింది.

* * *

*ఆంధ్ర జ్యోతి, సచిత్ర వార పత్రిక 1 -7- 1988 సంచికలో ప్రచురణ.*